## జర్నలిస్ట్ కథలు

# పాత పేపర్లు కొంటాం!!

జొన్నలగడ్డ రాధాకృష్ణ

హయగ్రీవరావు ఉరఫ్ డ్రాక్యులా డిప్యూటీ ఎడిటర్‌గానూ, మన్మథరావు జనరల్ మేనేజర్‌గానూ ప్రవేశించాక ప్రజాగోళ ఎడిటోరియల్ సిబ్బంది జీవితం దుర్భరం అయిపోయింది.

డ్రాక్యులా శవాల వార్తలు కావాలి, శవాల ఫోటోలు కావాలీ అని రిపోర్టర్లనీ ఫోటోగ్రాఫర్లనీ పీక్కుతింటున్నాడు.

మన్మథరావు సర్క్యులేషన్ పెంచడానికి మరో విట్కా ప్రవేశపెట్టాడు. సిటీలోని రకరకాల క్లబ్బులనీ, సాంస్కృతిక సంస్థలనీ వార్తలు వేస్తే సర్క్యులేషన్ యమస్పీడుతో పెరిగిపోతుందని ఉపదేశించాడు. అమెరికాలో ఆ పనే చేస్తారట.

తీరా ఈ క్లబ్బుల, సాంస్కృతిక సంస్థల ఫోటోలు కష్టపడి తెప్పిస్తే అన్నిట్లో మన్మథరావే ఉంటున్నాడు. సవ్యసాచిలా ఎక్కడ మీటింగ్ జరిగితే అక్కడ ప్రత్యక్షమై పోతున్నాడు. బొత్తిగా సమ్మంధం లేకపోయినా.

ఆ మధ్య లతామంగేష్కర్‌కి గవర్నర్ ఏదో అవార్డు ఇస్తే ఫోటో తీసే సమయానికి ఆ ఇద్దరి మధ్యా జారిపడిపోయి, ఆ నందపారవశ్యం అభినయించాడు. గులాం అలీ ఘజల్స్ పాడుతుంటే అతనికీ తబలావాడికీ మధ్య మన్మథరావేవున్నాడు. సంయుక్తా పాణిగ్రాహి డాన్సు చేస్తుంటే బాక్‌గ్రౌండ్‌లో తన్మయత్వంలో మునిగివున్న మన్మథరావు ప్రత్యక్షమైపోయాడు.

మన్మథరావు ఫ్రేములో లేకుండా ఫోటోలు తియ్యాల్లని ఇతర పేపర్లవాళ్ళు విశ్వప్రయత్నం చేసి ఘోరంగా విఫలమైపోయారు. ఒక పేపర్ ఎడిటరయితే ఫోటోగ్రాఫర్ మీద విరుచుకుపడ్డాడు. ఆ వెనకాల ఇకిలించే కేతిగాడికీ నీకూ ఏం సంబంధం' ప్రతిసారీ వాడి ఫోటో పట్టుకొస్తున్నావు అని. ఈ విధంగా చాలా ఎడిటర్లు తమ ఫోటోగ్రాఫర్లకీ ఆ బాక్‌గ్రౌండ్‌లో వాడికీ అక్రమ సంబంధం సైతం అంటగట్టసాగారు. వాళ్ళంతా పోలోమని వొచ్చి మన్మథరావు కాళ్ళమీద పడి, 'సార్ తమరు ఇకమీదట సకల స్టేజిలూ ఎక్కెయ్యకుండా ఆడిటోరియంలోనే ఎక్కడున్నా కుదురుగా కూర్చోండి—' అని వెయ్యివిధాల బతిమాలారు. మన్మథరావు ససేమిరా స్టేజిలు ఎక్కే తీరతానని, ప్రపంచంలో ఏ శక్తీ తను స్టేజి ఎక్కకుండా ఆపలేదనీ, పైగా తను ఎక్కకపోతే లతామంగేష్కర్, సంయుక్తా పాణిగ్రాహి, హరిప్రసాద్ చౌరాసియా, ఎమ్మెస్ సుబ్బలక్ష్మి వగైరాలు కుమిలిపోతారనీ విశదం చేశాడు.

దాంతో ఫోటోగ్రాఫర్లంతా వెళ్ళి సాంస్కృతిక సంస్థల వాళ్ళ కాళ్ళమీద పడ్డారు మన్మథరావుని పిలవ వద్దని. "ఎవడు పిలిచాడయ్యా వాణ్ణి. వాడంతట వాడే వొచ్చేస్తున్నాడు. బాడ్జి లాగేసు కుంటున్నాడు. స్టేజి ఎక్కేస్తున్నాడు, ఫోటో తీసేసరికి ఆనందపారవశ్యంతో పడిపోతున్నాడు. పొమ్మందామంటే వాడో పత్రిక్కి మేనేజరాయె. మీరే ఏదో చెయ్యండి" అని ఎదురు కాళ్ళమీద పడిపోయారు వాళ్ళంతా.

ఇలా నగరంలోని ఫోటోగ్రాఫర్లకీ, పత్రికల వాళ్ళకీ, యావత్ కళాప్రపంచానికీ దిక్కుతోచని పరిస్థితి సృష్టించాడు మన్మథరావు.

ఇదంతా పత్రిక సర్క్యులేషన్ పెంచడానికి చేస్తున్న పబ్లిక్ రిలేషన్స్ కృషి అని త్రయంబకాన్ని నమ్మించేశాడు. ప్రతీ ఒక్కడూ ఒక మన్మథరావై చెలరేగాలని, అప్పుడే ప్రజాగోళ బాగుపడుతుందని త్రయంబకం ఒక ప్రకటనలో స్పష్టం చేశాడు కూడా.

ముందు త్రయంబకం.

వెనక పంచాపకేశన్.

రెండు సైటుల్లో డ్రాక్యులా, మన్మథరావు కవర్ చేసేశారు.

ఇలా నాలుగువైపుల నుంచీ ప్రజాగోళ సిబ్బందికీ మిగిలివున్న కొద్దిమంది పాఠకులకీ ముంచుకు వస్తోంది ముప్పు.

ఓ రోజు ఆఫీస్ స్టాఫ్ అంతా చింతాక్రాంతులై వున్న సమయాన వీధిలోంచి "పాత పేపర్లు కొంటాం" అని కేక వినిపించింది.

ఆ కేక వినిపించగానే ఎడిటర్ త్రయంబకం బావమరిది పంచాపకేశన్ నాగస్వరం విన్న తాచు పాములా లేచి ఉషారుగా నిలబడ్డాడు.

ఈ పంచాపకేశన్ ఎప్పటి పాత పేపర్లు అప్పుడే అమ్మేసుకోవడం పాలసీగా పెట్టుకున్నాడు. వాడొచ్చిన దగ్గర్నించీ ఆఫీసులో నిన్నటి పేపరనేది కనిపించం లేదు. ఇవాళ ఆఫీసుకి వొచ్చినప్పటి నుంచీ నిన్న మిగిలిపోయిన పేపర్లన్నీ కట్టకట్టి దాని మీద కూర్చుని పాత పేపర్లు కొనేవాడి కోసం ఎదురుచూస్తున్నాడు.

వాడు రాగానే ఆఫీసు బోయ్ చేత కబురు చేశాడు లోపలికి తీసుకురమ్మని. ఆ లోపలికొచ్చిన వాణ్ణి చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వాడు ఏది పొడవో ఏది వెడల్పో తెలియనంత లావున్నాడు. చేతికి బంగారం వాచీ అన్ని వేళ్ళకీ బంగారం ఉంగరాలు.

"ఏమప్పా ఏం తింటావుండావు, ఇంత లావుగా వుంటావు" అన్నాడు పంచాపకేశన్ ఆశ్చర్యంగా.

"ఏవుంది సార్! చికెన్, మటన్, ప్రాన్స్ అందరూ తినేవే. చిన్నప్పటి నుంచీ మన సర్వాలిటీ ఇంతే సార్" అన్నాడు పేపరు వాడు సిగ్గుపడుతూ.

"ఏమి, చికెన్, మటన్, ప్రాన్స్ మేస్తావుంటివా. పేపర్ చదివే వాండ్లం మాకే సాంబారు కూడుగిట్టేది చిండా కష్టంగా వుంటాది. సరే కిలో ఎంతకి తీస్తావప్పా" అన్నాడు కూర్చున్న పేపర్ల కట్టమీంచి లేస్తూ.

"కిలోలేవిటి" అన్నాడు పేపరువాడు ఆశ్చర్యంగా.

"కిలోలు కాక టన్నులు కొందువా. మూతి చూడు. ఇవే వుంటాయి. రేటు పుడిస్తే దినం

నీకుదా వేస్తాను.''

''సార్ మీరు నన్ను అపార్థం చేసుకున్నారు. నేనొచ్చింది మొత్తం పేపర్ని కొనెయ్యడానికి. ఈ ఆఫీసు, ఈ బిల్డింగు, ప్రింటింగ్ మిషను, స్టాఫు ఎడిటరూ అందర్నీ కొనేస్తా'' అంటున్నాడు పాత పేపర్లవాడు.

''ఏమి మా బిల్డింగూ ప్రెస్సూ కొందువా. నీ మూతిని అద్దంలో చూసుకొంటివా. గెటవుట్ అయిపో అప్పా. లేకపోతే గూర్ఖాని పిలుస్తాను'' అన్నాడు పంచాపకేశవ్.

''ఏయ్! మాటలు జాగర్తగా రానియ్. నేను ఎవరో తెలుసా పెద్ద కాంట్రాక్టర్ని. మొన్న కూలి పోయింది చూడు రైల్వే బ్రిడ్జి— నే కట్టిందే. బయట ఉన్న మెర్సిడిజ్ బెంజి కారు నాదే'' అన్నాడు పేపర్ వాడు.

''ఆ బెంజ్ కారు నీదా, అదిగో ఆకాశంలో ఎగర్తా వుండాదే ఏరోప్లేను— అది నాదే. కాదులో పువ్వు పెట్టుకున్నవాడికి చెప్పు'' అన్నాడు పంచాపకేశవ్.

ఇద్దరూ దాదాపు కొట్టుకునే పరిస్థితికి వొచ్చేసరికి గుర్నాథం వొచ్చి విడదీసాడు.

పాత పేపర్లవాణ్ణి శాంత పరచి అతని కథాకమామిషూ అడిగాడు. తను కోటీశ్వరుణ్ణనీ, అర్జంటుగా పేపర్ పెట్టవలసిన అవసరం ఏర్పడిందనీ, అందేత పాత పేపర్ కోసం తిరుగుతున్నాననీ చెప్పాడు.

''ఏవిటా అర్జంట్ అవసరం?'' అన్నాడు గుర్నాథం.

''అర్జెంటుగా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రివి అవ్వాలి.''

''ఎందుకంత అర్జంటుగా ముఖ్యమంత్రివి అయిపోవాలి.''

''కాంట్రాక్ట్ల కోసం ఇప్పుడు అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకోవాల్సి వస్తోంది. నేనే ముఖ్యమంత్రి నయిపోతే అప్పుడు నా కాళ్ళు నేనే పట్టుకుంటే సరిపోతుంది. పైగా ఇప్పుడు పరమచండాలంగా నానారకాల టాక్సులూ కట్టేంచుకుంటున్నారు. అదే నేనే ముఖ్యమంత్రినైతే నా ఒక్కడి టాక్సులై నా రద్దు చేసుకోవచ్చుగా. కొత్త పేపరు పెట్టడానికి టైములేదు. ఎలక్షన్లొచ్చేస్తున్నాయి. అందుకే పాత పేపర్ల కోసం రోడ్లమీద పడ్డా. ఇంతకీ పేపరు అమ్ముతారా లేదా?''

''సార్! ఇంకొక్క లాస్ట్ ప్ర  మీరు ముఖ్యమంత్రి అవడానికీ పేపరు కొన  ఏం సంబంధం సార్?

మా ఎడిటర్ కీ వాళ్ళ నాన్నకీ కూడా పేపరుంది. కానీ వాళ్ళు పంచాయితీ బోర్డు మెంబర్లు కూడా కాలేదే.''

''పేపర్ వుంటే అందరూ మన గ్రిప్‌లోకి వస్తారు. ముందు ఢిల్లీ వెళ్ళి బ్లాక్‌లో పార్టీ టిక్కెట్టు తెచ్చుకుంటా! ఆ తరువాత ఓట్లు కొనుక్కుంటా. ఎమ్మెల్యే అయింతర్వాత పార్టీ ఎమ్మెల్యేలందర్నీ కొనేసి ముఖ్యమంత్రి నయిపోతా. ఇక మీ ఎడిటర్ అంటావా వాడు బహుశా వో బఫూన్ అయి ఉంటాడు. తెలుగులో మూర్ఖపు ముండావాడు అవొచ్చు'' అని పాత పేపర్ల వాడు అంటుండగానే త్రయంబకం వొచ్చేశాడు.



"ఎవడీ బొండాం. నా ఆఫీసులోకి వొచ్చి నన్నే తిడుతున్నాడు" అంటూ పంచె పైకి ఎగ్గట్టాడు.

"చూడు బావా. వీండు మన పేపర్ని, నిన్నూ నన్నూ కొనేస్తానంటావుంటాడు. వీండా తిమురు పట్టి వుంటాయి. మన ఆఫీసుకి వచ్చి నన్నే తిడతా వుంటాడు" అన్నాడు పంచాపకేశన్.

"ఏర బొండాం. అసలు నేనెవరో తెలుసా? ఈ దేశానికి సొతంత్రం ఎవరు తెచ్చారు? ఆ సంగతైనా తెలుసా కనీసం?" అన్నాడు త్రయంబకం గుడ్లెర్రజేస్తూ.

పాత పేపర్లవాడు జనరల్ నాలెడ్జ్ పరీక్షకి సిద్ధం అయి వొచ్చినట్టు లేదు. "అంబేద్కర్ పొట్టి శ్రీరాములో తెచ్చి వుండాలి" అన్నాడు గాభరాగా.

"రాంగ్, యూ ఆర్ టోటల్లీ రాంగ్. ఈ దేశానికి సొతంత్రం తెచ్చింది త్రయంబకం అంటే నేనే. పోనీ అప్పిచ్చువాడు వైద్యుడు పజ్యం రాసిందెవరో తెలుసా" అన్నాడు త్రయంబకం.

"అది కూడా మీరే రాసుంటారు. సొతంత్రం తెచ్చిన వాడికి పజ్యం రాయడం వో లెక్కా" అంటున్నాడు పాత పేపర్ల వాడు.

త్రయంబకంలో కోపం మాయమై కరుణ రసం పొంగి పొరలింది.

"నిన్ను చూస్తే జాలేస్తుంది. ఈ మాత్రం కూడా జనరల్ నాలెడ్జ్ లేని వాడివి తగుదుమన్నా అని పేపర్ కొనడానికి బయల్దేరేవా, నాసికా భూషణం ఖండి కావ్యం చదివేవా. నే రాసిందే. చదివుండవు గ్యారంటీగా చదివితే ఇలా రోడ్డున పడవు — పాత పేపర్లు కొంటావని. లోపలికి రా ఓ కాపీ ఇస్తా, నా ఎడిటోరియల్స్ కూడా చదివుండవుగా, అదీ వొచ్చింది పుస్తకం. ఈ రెండూ చదివి నాలెడ్జి పెంచుకో. ఈ రోజు పేపర్లో నేరాసిన పజ్యాలు నాలుగు పడ్డాయి చదివావా. అవి నాలుగూ చదువు – ీ జన్మ ధన్యమైనట్టే. ముదనష్టం బ్రిడ్జీలు ఎన్నికడితే ఏం ఉంది."

"సార్! పజ్యాలు గానీ, ఖండకవ్యాలు కానీ, సంపాదకీయం పుస్తకాలు గానీ చదవడం మా ఇంటావంటా లేదు సార్, పేపరమ్ముతారో లేదో చెప్పండి. మీరమ్మకపోతే మరో వోటికి పోతా. క్షమించి నన్నొదిలెయ్యండి సార్" అన్నాడు బొండాం దీనంగా.

"వెళుదువుగాని లేవోయ్. ముందీ పజ్యాలు. విను తరువాత మాట్లాడుకుందాం" అని త్రయంబకం పద్యం చదవడం మొదలుపెట్టేసరికి బొండా ఓపిక చేసుకుని తన శరీరం అనుమతించినంత వేగంతో అక్కడి నుంచి పారిపోయి మెర్సిడిజ్ బెంజ్ కార్లో పడిపోయాడు.

# జ్ఞాన చైతన్యం

'పూజ, జపము, ధ్యానము' అనునవి హిందువులందరికీ పరిచయమున్న పదములు. చాలామంది వాటి గురించి తమకు అంతో, ఇంతో తెలుసునని భ్రమిస్తారు.

'పూజ' అనగా దేవాలయమునకు వెళ్ళిగాని, ఇంటివద్దగాని, తాము నమ్మిన దేవతామూర్తిని పువ్వులనో, పత్రములనో సమర్పిస్తూ, ఆ దేవతామూర్తి నామమును ఉచ్చరించుటయే అని అనుకొంటారు.

'జపము' అనగా కన్నులు మూసుకొని దైవ స్వరూపమును మనసులో తలబోస్తూ ఆ దైవ నామమును స్మరించుటయే అని అంటారు. దీనినే మానసిక పూజారాధన అని కూడా అంటారు.

'ధ్యానము' అనగా జపము వలే కన్నులు మూసి దైవ నామమును మనసులో స్మరించుటయని కొందరంటారు.

ఈ పద్ధతులన్నీ భగవంతుని సాక్షాత్కారము పొందుటకేయని చాలామంది భావిస్తారు. కానీ కొంతమంది మాత్రమే భగవత్సాక్షాత్కారము అనగా ఏమిటో, భగవత్స్వరూపము ఎలా ఉంటుందో అందరికీ అర్థమయ్యేలా వివరించగలరు.

మనస్సు, హృదయాల సమన్వయం—

మనస్సునకున్న గుణాలు, హృదయానికున్న శక్తులు సమన్వయ పరచటం ఎంతో అవసరం. హృదయాన్ని నిర్లక్ష్యం చేస్తూ మనస్సు ఒక్కదానికే ప్రాధాన్యతనిస్తే, మనిషి తప్పుదారిలో నడవకుండా ఆగలేడు. అందుకే ప్రపంచంలో అంతా గజిబిజిగా కనిపిస్తోంది.

అంతకంతకూ ప్రపంచంలో ఆందోళన పెరిగిపోతోంది. సామాజికంగాను, వ్యక్తిగతంగాను సంఘర్షణ తీవ్రస్థాయిలో పెరిగిపోతోంది. వ్యక్తి జీవితంలో సామరస్యాన్ని తిరిగి నెలకొల్పి, అతనికి శాంతి లభించే మార్గాన్ని తెలియజేయటం నేడు వెంటనే చేపట్టవలసిన కార్యక్రమం. కేవలం ఆంతరంగిక శాంతి కారణంగానే వ్యక్తికి సౌఖ్యమూ, వివేకమూ లభిస్తాయి. మనం ఇప్పుడు పిలిచే మేధాశక్తి, జ్ఞానము అనునవి విఫలమవుతున్నాయని ఖచ్చితంగా చెప్పవచ్చును.

మానవుని మనస్సుకూ, హృదయానికీ, జ్ఞానాన్ని, ప్రకృతి యొక్క గుణాన్ని అందించగల ప్రక్రియనే 'ధ్యానము' అని చెప్పవచ్చును.

'ధ్యానము' అనునది క్రొత్త మాట కాదు. అనేక శతాబ్దాల పురాతనమైనది. కృష్ణుడే కానీ, క్రీస్తు కానీ చెప్పేదేమిటంటే, నీ హృదయ సామ్రాజ్యములోని దైవ హృదయంలోకి ప్రవేశించు. అప్పుడే నీవు శాశ్వతమైన స్వేచ్ఛను, శాంతిని పొందగలవు. ఈ విగమైన ధ్యానాన్ని శతాబ్దాలుగా ప్రజలు మర్చిపోయారు. అందువలననే మనిషి బాధలు పడుతున్నాడు. లేక బాధపడుతున్నట్లుగా కనిపిస్తున్నాడు. అందుమూలముననే మనిషికి 'బాధ' అన్నది చాలా సాధారణమైన విషయంగా కనిపిస్తోంది. మనిషి జీవితంలో అది తప్పించుకోలేని విషయంగా మారిపోయింది. పోను పోను జీవితము ఒక విషతుల్యమని, బాధాకరమైన పెనుగులాట గాను వర్ణించే వారిని ఎంతో ఉన్నతులుగాను, బుద్ధి స్థిమితము కలవారిగాను, నిజాన్ని పరిపూర్ణముగా గ్రహించిన వారిగాను పొగడటం ప్రారంభించారు. ప్రజలు నిజం చెప్పాలంటే మానవుడు సుఖపడటానికే పుట్టాడు, దుఃఖించటానికి కాదు. మానవుని జీవితపు లోపలి విలువలను అనగా ఆధ్యాత్మిక విలువలను, బాహ్యపు విలువలను గుర్తించి, ఆ రెండిటేని సమన్వయ పరిచినప్పుడే జీవితం సమగ్రమవుతుంది. అది ఎంతో యోగదాయకమైన స్థితి అని చెప్పవచ్చును.

చుట్టూ ఎన్నో బాధలు, విషాద భరితమైన వాతావరణము కన్పిస్తుంటే, జీవితం ఎంతో ఆనందమయ



మైనదని చెప్పటంలో ఎంతవరకూ సమంజసము? అన్న అనుమానము చాలామందికి కలుగుతుంది.

బత్తాయి పండు ఎంతో తియ్యగా ఉంటుందని మనం చెప్పుకొంటాము. అంటే లోపలి పదార్థం తియ్యగా ఉంటుందని అర్థం. పైనున్న చర్మం చేదుగా ఉంటుంది. బత్తాయి లాగనే మనిషి జీవితానికి కూడా రెండు భాగాలున్నాయి. లోపల, బయట. లోపల ఉన్నది శాశ్వతమైనిది. అది ఎన్నటికీ మారక, పరమానంద స్థితిని అనుభవింపజేస్తుంది. బయటి జీవితము అశాశ్వతమైనది. ఎప్పుడూ మారుతుంటుంది. లోపలి జీవితాన్ని బట్టే, అది ఆనందదాయకమైనదని చెబుతారు.

— శర్మాజీ